





శనివారం 27 జూన్ 2026 పేజీలు : 8

# గంజాయి సేవించే వారిపై జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

40 మందికి గంజాయి టెస్టింగ్ కిట్లతో పరీక్షలు10 మందికి పాజిటివ్

గంజాయి వ్యసనానికి చికిత్సే మార్గం... డి-అడిక్షన్ సెంటర్లకు తరలింపు

ఇప్పటివరకు 39 మందినిడి అడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

# మతసామరస్యానికి ప్రతీక మొహర్రం 'పీర్ల పండుగ'

డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్

రయ్యాడి గ్రామంలోని హస్సేన్ హుసేన్ దేవస్థానాన్ని దర్శించుకున్న నరేష్ జాదవ్

పంటలు బాగా పండాలని ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు





# గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత, ప్రజలు పోరాడాలి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసిన జిల్లా ఎస్పీ

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో "5కె రన్" నిర్వహణ

పాల్గొన్న 2000 మంది యువత ఐదు కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి యువతకు ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎస్పీ

# చెన్నూరులో ఎస్ఐఆర్ ఓటర్ల ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభం

**మంచిర్యాల, 26, జూన్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, డీసీసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి సూచనలతో శుక్రవారం చెన్నూర్ పట్టణంలో ఎస్ఐఆర్ ఓటర్ల ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ) ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు, సవరణ, ఎన్నికల విధివిధానాలు, అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై కీలక సూచనలు అందించారు. బూత్ స్థాయిలో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి బూత్ లెవెల్ ఏజెంట్లే వెన్నుముకలుగా నిలుస్తారని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ, చెన్నూర్ బ్లాక్ ఇన్‌చార్జ్ పుల్లూరి లక్ష్మణ్, డీసీసీ మంచిర్యాల జిల్లా సెక్రటరీ, చెన్నూర్ మండల ఇన్‌చార్జ్



కొండు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగంపల్లి మహేష్, బీఎల్ఓ ఉమ మహేశ్వరి, బీఎల్ఏ ఒద్ది నవీన్ సచిన్ తదితరులు పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంభించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితా నమోదు, సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని నాయకులు కోరారు

# పేపర్ లీక్ మాఫియాను తరిమికొట్టాలి

## రాహుల్ గాంధీకి సపోర్ట్‌గా వాంకిడిలో కాంగ్రెస్ గర్జన

## విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే: గురునూలే నారాయణ

**ఆసిఫాబాద్ జూన్ 26 ప్రజా జ్యోతి** యువత ఉద్యోగాలను పేపర్ లీక్ మాఫియా దోచుకుంటోందని, వెంటనే ఆ గ్యాంగ్‌ను తరిమికొట్టాలని వాంకిడి కాంగ్రెస్ నేతలు గర్జించారు. ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షురాలు అత్రం సుగుణక్క ఆర్డర్‌తో సోమవారం మండల కేంద్రంలో 'ఛాత్రోన్ కీ గూంజ్' పేరుతో కార్యక్రమం పెట్టారు. రాహుల్ గాంధీకి సపోర్ట్‌గా జనంతో సంతకాలు చేయించారు.
అణచివేత విధానం వద్దు: మండల అధ్యక్షుడు గురునూలే నారాయణ మాట్లాడుతూ.. దేశంలో ఇప్పుడున్న పరీక్షల సిస్టమ్ మొత్తం అణచివేత, దోపిడీతో నిండిపోయిందని మండిపడ్డారు. పేపర్లు లీక్ చేస్తూ పిల్లల లైఫ్ నాశనం చేస్తున్నారని, ఇంకా ఎన్నాళ్లు ఈ మాఫియా రాజ్యమేలుతదని ఫైర్ అయ్యారు.
**మూడు డిమాండ్లు:** రాహుల్ గాంధీ సారథ్యంలో పోరాటం చేస్తామని, ప్రభుత్వం దిగొచ్చే వరకు వదిలిపెట్టబోమని వార్నింగ్ ఇచ్చారు. వెంటనే ఈ మూడు డిమాండ్లు నెరవేర్చాలన్నారు. పరీక్షల విధానాన్ని మొత్తం మార్చాలి. విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి. పేపర్ లీక్ మాఫియాతో ఆయన లింక్‌పై పూర్తి ఎంక్వైరీ



చేయాలి. ఏడాదికి ఒకసారి పరీక్షలు, ఉద్యోగాల క్యాలెండర్ ఫిక్స్ చేయాలి. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ సాయికుమార్, జిల్లా సెక్రటరీ నాగభూషణం, మెంగజీ, గణేష్, వెల్గి సర్పంచ్ భీంరావ్, జంబూల్ ధరి పవన్, బంబర కృష్ణ, యువజన ఇంచార్జి అధ్యక్షులు ఉప్పుల కృష్ణ, బెండర వార్డు సభ్యులు ఉష, మాజీ ఎంపీటీసీ మారుతి, సినియర్ గుండయ్య, నాగోసే రామ, ఇల్లూరి రాము, ఉప విట్టల్, కిషన్, మహేష్, మాజీ ఉప సర్పంచ్ పేంటు దేవరావు, శంకర్, మారుతీ, సోనులే నానాజీ, భాను తదితరులు పాల్గొన్నారు

# సర్ ప్రక్రియను పారదర్శకంగా చేయాలి.ఆర్డీవో మోహన్ సింగ్

**జన్నారం,జూన్26(ప్రజాజ్యోతి)**భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా చేయాలని ఉట్నూర్ ఆర్డీవో మోహన్ సింగ్ పేర్కొన్నారు. జన్నారం మండలంలోని మురిమడుగు ఇంధనపెల్లి, టిజి పల్లె గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన సర్ ప్రక్రియ ను ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి సబ్బా రమేష్ తో కలిసి సందర్శించారు. బూత్ లెవెల్ అధికారి(బి.ఎల్.ఓ) ల ద్వారా ఇంటింటికి ఎన్యూమనరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలించి, సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సర్ ప్రక్రియ పై ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో తహసీల్దార్ బక్కయ్య, గిర్దావర్ వెంకటేశం, బూత్ లెవెల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంధనపెల్లి యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



**జన్నారం,జూన్26(ప్రజాజ్యోతి)**నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు శుక్రవారం రోజున ఎన్.ఎస్.యు. ఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ షా ఆధ్వర్యంలో జన్నారం మండలంలోని ఇందనపల్లి యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ ఇందనపల్లి గ్రామ అధ్యక్షుడిగా కంఠం సాయిరాం, ఉపాధ్యక్షుడిగా కాంద్రపు వంశీ ,సభ్యులుగా రాగుల వెంకటేష్ ,అరవింద్, కృష్ణ ,మహేష్ ,రంజిత్, సాదిక్, అశోక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగ్లావత్ శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి,చుంచు నరసయ్య, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## ఉపసర్పంచ్‌కు యూత్ ఘన సన్మానం

### మాదకద్రవ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి: యూత్ అధ్యక్షుడు



**కేరమేరి జూన్ 26 ప్రజా జ్యోతి** కేరమేరి మండల కేంద్రంలో శుక్రవారం యూత్ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ సాగర్ కు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు జంగు మాట్లాడుతూ, గ్రామాన్ని మాదకద్రవ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భారతదేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడం తమ బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నశా ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహణ

### సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ -- ప్రతిజ్ఞ




**కేరమేరి జూన్ 26 ప్రజా జ్యోతి** కేరమేరి మండలంలోని సుర్ధాపూర్, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుర్ధాపూర్ గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో, యువజన అధ్యక్షుడు కాత్లె జంగు నేతృత్వంలో గ్రామ వీధుల గుండా ర్యాలీ చేపట్టి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులు, యువతతో కలిసి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, సమాజాన్ని వ్యసన రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన బోడంకి చందుకు ఘన సన్మానం

## జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం

**మంచిర్యాల, 26, జూన్ (ప్రజాజ్యోతి):** సిపిఎం రాష్ట్ర స్థాయి సమావేశంలో కోటపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బోడంకి చందు సిపిఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా ఎన్నిక కావడంతో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్‌లో ఘన సన్మాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బోడంకి చందు గత 20 సంవత్సరాలుగా సిపిఎం పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం ఎండగడుతున్న నాయకుడిగా చందు గుర్తింపు పొందారని తెలిపారు. ఇటువంటి నాయకత్వాన్ని గుర్తించి రాష్ట్ర కమిటీ ఆయనను జిల్లా కార్యదర్శిగా నియమించడం హర్షణీయం అని అభిప్రాయపడ్డారు. సన్మాన గ్రహీత బోడంకి చందు మాట్లాడుతూ, సిపిఎం పార్టీ తరపున రాష్ట్రంలో ఎంబీసీ, బీసీ ఉద్యమాలతో పాటు బీసీ సబ్ ప్లాన్ సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించానని



తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా బీసీల హక్కుల సాధన కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. తనకు సన్మానం నిర్వహించిన పెద్దలు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, గజ్జెల్లి వెంకటయ్య, మంచిర్యాల సాధానందం, రామగిరి రాజన్న చారి, అశోక్, వేముల ఎండి అఫ్రోజ్, బోడంకి చందు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల లో మతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా మొహర్రం (పీర్ల) పండుగ





**మంచిర్యాల, 26, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల పట్టణంతో పాటు సింగరేణి కార్మికులు అధికంగా నివసించే కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో పీర్ల పండుగగా పిలవబడే మొహర్రం ఉత్సవాలను మతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ ఓవర్‌బ్రిడ్జి సమీపం, హమాలివాడ, పాత మంచిర్యాల, హైటెక్ సిటీ తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచే పీర్ల ఊరేగింపులు నిర్వహించారు. ప్రతి ఇంటి ముందు ప్రజలు చేరుకుని పీర్లకు మొక్కులు చెల్లించారు. భక్తులు తమ కోరికలు నెరవేరాలని, కుటుంబాలు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ కుడుకలు, నగదు రూపంలో మొక్కుబడులు సమర్పించారు. మొహర్రం పండుగ సందర్భంగా ప్రభుత్వం, అలాగే సింగరేణి యాజమాన్యం సెలవులు ప్రకటించాయి. కోల్‌బెల్ట్ ప్రాంతాలైన నస్పూర్, శ్రీరాంపూర్, బెల్లంపల్లి తదితర ప్రాంతాల్లో కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. పీర్లను ఏర్పాటు చేసి వాటి ముందు అగ్నిగుండం సిద్ధం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుల వాయిద్యాల నడుమ భక్తులు "అసోయ్ దుల్లా హారతి" అంటూ భక్తి పారవశ్యంలో అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కొంతమంది భక్తులు తమ కుటుంబ సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులను చెప్పుకొని ఆధ్యాత్మిక విశ్వాసాలతో పరిష్కార మార్గాలను ఆశ్రయించారు.

**పీరీల ఊరేగింపుల వెనుక చరిత్ర......**

మొహర్రం రోజున పీరీలను ఊరేగించడం వెనుక ఒక గొప్ప



చారిత్రక నేపథ్యం ఉంది. కర్బలా యుద్ధంలో సత్యం, న్యాయం కోసం పోరాడిన అమరవీరుడు హజరత్ ఇమామ్ హుస్సేన్ మరియు ఆయన అనుచరుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ పీరీల (అలమ్) ఊరేగింపులను నిర్వహిస్తారు. యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలు, జెండాలకు ప్రతీకగా పీరీలను రూపొందిస్తారు. వారి త్యాగం, ధైర్యసాహసాలు, ఆశయాలను గుర్తుచేసుకుంటూ భక్తిశ్రద్ధలతో ఊరేగింపులు చేపడతారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగను మంచిర్యాల జిల్లాలో ప్రజలు మతాలకు అతీతంగా జరుపుకోవడం విశేషంగా నిలిచింది.

## ఎస్ఐఆర్ సర్వేలో ఇంటింటి పరిశీలన

**ఓటర్ల వివరాల ధృవీకరణకు సహకరించాలి: సర్పంచ్ టేకం గంగారం**



**ఆసిఫాబాద్ జూన్ 26 ప్రజా జ్యోతి** ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామంలో ఇంటింటి ఓటరు సర్వే నిర్వహించారు. గ్రామ సర్పంచ్, ఆసిఫాబాద్ మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు టేకం గంగారాం మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తున్నారని తెలిపారు. గ్రామంలో డప్పు చాటింపు ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు తొలగించడంతో పాటు ఓటర్ల ఫోటోలు, చిరునామా తదితర వివరాలను సరిచూసి నమోదు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి అర్హుడైన ఓటరు తమ వివరాలను పరిశీలించి ప్రక్రియను విజయవంతం చేయాలని, ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తించి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓ మర్రి నర్సమ్మ, వివో ఏ. శారద, గ్రామ ఓటర్లు బండి తిరుపతి, బండి సాలమ్మ, బోయిని రాజమ్మ, కే. శోభ, కే. కొండు, నాగమణి, యశోద తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్‌కు ఘన నివాళి

**సామాజిక న్యాయానికి మార్గదర్శి.. అంబేద్కర్ విద్యకు అండగా నిలిచిన మహనీయుడు: వక్తలు**



**ఆసిఫాబాద్, జూన్ 26 ప్రజా జ్యోతి** బడుగు, బలహీన వర్గాల సామాజిక, విద్యా అభ్యున్నతికి కృషి చేసిన రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ జయంతిని శుక్రవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డా. అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ సమాజం లోని వెనుకబడిన వర్గాల అభివృద్ధే దేశాభివృద్ధికి పునాదిగా భావించిన సాహు మహారాజ్ కొల్హాపూర్ సంస్థానంలో రిజర్వేషన్లను అమలు చేసి సామాజిక న్యాయానికి బాటలు వేశారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సాధికారత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఉన్నత విద్యాభ్యాసానికి సాహు మహారాజ్ అందించిన సహకారం భారత చరిత్రలో విశిష్ట ఘట్టమని, ఆ ప్రోత్సాహమే అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా ఎదగడానికి దోహదపడిందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం సాహు మహారాజ్ చేసిన కృషి భావితరాలకు ఆదర్శమని కొనియాడారు.కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్, భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు దుర్గం దూర్గాజి, కార్యదర్శి రాంటేకే ప్రతాప్, రమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు కొబ్రగడే గంగుబాయి, నాయకులు దుర్గం శ్రీనివాస్, మహత్మే రాజేంద్ర ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజనులకు రిజర్వేషన్లు అమలు చేసి సామాజిక న్యాయానికి మార్గదర్శకుడిగా నిలిచారు

## బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్

### ఘనంగా ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలు





**మంచిర్యాల, 26, జూన్ (ప్రజాజ్యోతి):** ఛత్రపతి సాహు మహారాజ్ బహుజనులకు రిజర్వేషన్లు అమలు చేసి సామాజిక న్యాయానికి మార్గదర్శకుడిగా నిలిచారని బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ కొనియాడారు .కొల్హాపూర్ సామాజిక సంస్థానాధీశుడు, సామాజిక న్యాయానికి కృషి చేసిన మహనీయుడు ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలను మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వక ఈవెన్టీ ట్రస్టులో శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఛత్రపతి సాహు మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్య క్రమాన్ని ఉద్దేశించి బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్య క్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఛత్రపతి సాహు మహారాజ్ కొల్హాపూర్ సంస్థానంలో బహుజనులకు రిజర్వేషన్లు అమ లు చేసి సామాజిక న్యాయానికి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నా రు. బుద్ధుడు, కబీర్, మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలను ఆచరణ లో చూపిన మహానుభావుడు సాహు మహారాజ్ అని పేర్కొన్నారు. అలాగే డాక్టర్ అంబేద్కర్ విద్యాభ్యాసానికి సహకారం అందించడంతో పాటు "మూక్ నాయక్" పత్రికకు అండగా నిలిచారని చెప్పారు. 1920 మార్చి 22న జరిగిన దక్కన్ అస్పృశ్య సమాజ సమ్మేళన సభలో అంబేద్కర్ ఆశయాలే భవిష్యత్తుకు మార్గదర్శకమన్నారని తెలిపారు. తమ సంస్థానంలో వెనుకబడిన వర్గాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు భూములకు పట్టాలు ఇచ్చారని, గంగారాం కాంబ్లే హోటల్ ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సహాయం అందించి స్వయంగా అక్కడ టీ తాగి సామాజిక సమానత్వానికి చిహ్నంగా నిలిచారని చెప్పారు. వితంతు వివాహ చట్టాన్ని తీసుకురావడంతో పాటు కులాంతర వివాహాలను ప్రోత్సహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు గాజుల శంకర్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోమాస బ్రహ్మానందం, జిల్లా నాయకులు పేట్టెం చంద్రశేఖర్, దుర్గం గంగారాం, కుమ్మరి కృష్ణ చైతన్య, ముల్కల్ల జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా దందా.. రైతన్నకు శాపం

## అధికారులు-వ్యాపారులు కుమ్మక్కు.. సొసైటీల్లో యూరియా ఖాళీ

## మళ్లీ యూరియా కష్టాలు.. రోడ్డెక్కే పరిస్థితి

**ఆసిఫాబాద్ జూన్ 26 ప్రజా జ్యోతి** ఖరీఫ్ సీజన్ స్టార్ట్ అయిందో లేదో.. జిల్లాలో యూరియా దందా మళ్లీ మొదలైంది. సొసైటీల్లో యూరియా ఖాళీ చేసి ప్రైవేట్ షాపుల్లో బ్లాక్‌లో అమ్మేస్తున్నారని రైతన్నలు మండిపడుతున్నారు.




**కుమ్మక్కై దోచుకుంటున్నారు:**

వ్యవసాయ అధికారులు ప్రైవేట్ ఎరువుల వ్యాపారులతో కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ ఫైర్ అయ్యారు. సొసైటీలకు స్టాక్ ఇవ్వకుండా ప్రైవేట్ షాపులకు తరలించి ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారని ఆరోపించారు.

**గత ఏడాది అదే తంతు:**

గత ఏడాది కూడా ఇదే తీరుతో రైతులు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేశారని, దీంతో అప్పటి జిల్లా వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. అయినా అధికారుల తీరు మారలేదని, ఈసారి కూడా యూరియా కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్నారు.

**నామమాత్రపు తనిఖీలే:**

అధికారులు నామమాత్రంగా షాపులకు వెళ్లి వస్తున్నారే తప్ప ఒక్క దుకాణంపైనా కేసు పెట్టిన పాపాన పోలేదని మండిపడ్డారు. అంటే జిల్లాలో అన్ని షాపులు రూల్స్ ప్రకారమే నడుస్తున్నాయా? లేక అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారా? అని నిలదీశారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకుని కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు, సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: సర్పంచ్ బుర్రా పోచయ్య



**ఆసిఫాబాద్ జూన్ 26 ప్రజా జ్యోతి** రాజంపేట గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటికి సత్వర పరిష్కారం చూపడమే గ్రామపంచాయతీ పాలకవర్గం లక్ష్యమని రాజంపేట గ్రామ సర్పంచ్ బుర్రా పోచయ్య అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని టీఆర్ నగర్ సమీపంలోని పీరియల్ బంగ్లా వద్ద నాగపురివాడలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరింగ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగపురివాడలో చాలా కాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన బోరింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామంలోని ప్రతి ప్రాంతానికి మౌలిక వసతులు కల్పించేందుకు పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వార్డు మెంబర్ ఫోరం అధ్యక్షుడు, వార్డు సభ్యుడు గులాం జావీద్, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, వార్డు సభ్యులు బొట్టుపెల్లి లావణ్య, ప్రశాంత్, జాబారి కిషోర్, కుంరం వేణు, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, బీసీ నాగేందర్ తది తరులు పాల్గొన్నారు. స్థానికులు బోరింగ్ ఏర్పాటు చేసినందుకు గ్రామపంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయి రహిత తెలంగాణే రామగుండం పోలీస్ కమిషనరేట్ సంకల్పం, లక్ష్యం



**మంచిర్యాల, జూన్ 26 (ప్రజా జ్యోతి):** అంతర్జా తీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సంద ర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరి ధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో 2కే రన్‌లు, భారీ అవగాహన ర్యాలీలు, మానవహారాలు, డ్రగ్స్ వ్యతిరేక ప్రదర్శనలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించి తమ జీవిత లక్ష్యాలను సాధించాలని అధికారులు సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్ విధానంతో పోలీసు శాఖ కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు అది కారులు తెలిపారు. డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ నంబర్ 8712671111కు లేదా సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. "మత్తుకు దూరం... భవిష్యత్‌కు చేరువ!"

## ప్రజావాణి పిటిషన్ల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్లో సమీక్ష

**నిర్వహించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**ఖానాపూర్ జూన్ 26 (ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లాలో ఎటువల్ల నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల పురోగతిపై జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను ప్రత్యేకంగా సమీక్షించి, వాటి విచారణను వేగవంతం చేయాలని ఎస్పీ జానకి సూచించారు. ప్రతి ప్రజావాణి పిటిషన్‌పై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా పోలీస్ స్టేషన్లో అధికారులను ఆదేశించారు ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజావాణి కార్యక్రమం కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్నారు

## ఎస్ఐఆర్ పై కాలనీవాసులతో సమావేశం

**సర్వే ఓటర్ల నమోదు క్రమంలో 241 బూత్ పూర్తి సహకారం**

**మున్సిపల్ వైస్ చైర్మన్ సోయాబ్ హుస్సేన్ వెల్లడి**



**ఖానాపూర్ జూన్ 26 (ప్రజా జ్యోతి )** కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ సర్వే కార్యక్రమాల్లో భాగంగా ఓటర్ల నమోదు కు పూర్తి సహకారం అందజేస్తామని నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ సోయా హుస్సేన్ అన్నారు శుక్రవారం 241 బూత్ లెవెల్ ఓటర్ల సమావేశాన్ని స్థానిక బిఎల్ఓ అంగన్వాడి టీచర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు ఓటర్ల నమోదు పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు ఒక క్యాంపు కార్యాలయంగా ఏర్పరిచి స్వచ్ఛంద కార్యకర్తలతో ఓటర్ నమోదు ప్రక్రియ తప్పులు లేకుండా ఫారాలని నింపేందుకు సహకరిస్తామన్నారు 6 వార్డులోని పోలింగ్ బూత్ లో గల ఓటర్ల పాత 2002 లిస్టు ప్రకారం కేంద్రం కోరిన విధంగా ప్రస్తుత నివాస పక్కా అడ్రస్ ను క్రోడీకరించడం జరుగుతుందని దీనికి సిక్స్ వార్డ్ ప్రజలంతా సహకరించి తమ తమ ఓటర్ల సవరణ పూర్తి చేసుకోవాలన్నారు ఓటు తమ జన్మ హక్కు అని దీన్ని నిర్లక్ష్యం చేయకుండా విస్మరించకుండా ప్రతి ఒక్క ఓటరు ప్రస్తుతం జరుగుతున్న సర్వే కనుగుణంగా ఇచ్చే ఫారాలను ఒకరికి రెండుసార్లు గమనించి తప్పులు లేకుండా పూర్తి చేసి ఇవ్వాలని వైస్ చైర్మన్ సోయా హుస్సేన్ ఓటర్లను కోరారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఏ నసీర్ అహిమాద్, బర్కత్పురవాసి వహాబ్, ఇసాక్ అహ్మద్, మెహరాజ్ ఉద్దీన్, అర్షద్ ఖాన్, సిక్స్ వార్డ్ నివాసి సీనియర్ పాత్రికేయులు మంత్ర రాజం దేవేందర్, మహమ్మద్ సజ్జాద్,ఆ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# మత్తు పై ఉక్కుపాదం

**పోలీసుల భారీ అవగాహన కార్యక్రమం**

**2కే రన్, మానవహారం, ప్రతిజ్ఞతో యువతకు సందేశం**




**జైపూర్, జూన్ 26 (ప్రజా జ్యోతి)**అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జైపూర్ మండల కేంద్రంలో పోలీసులు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు ఏసీపీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువు, క్రీడలు, ఉపాధిపై దృష్టి సారించాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.అనంతరం ఎస్ఐ భూమేష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ) ప్రధాన గేటు వరకు 2 కిలోమీటర్ల అవగాహన రన్ నిర్వహించారు.ఈ ర్యాలీలో విద్యార్థులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మత్తు వ్యతిరేక నినాదాలతో ప్రజల్లో చైతన్యం నింపారు.అనంతరం జైపూర్ బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేసి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై ప్రజలకు వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.మత్తు రహిత సమాజ నిర్మాణమే పోలీసు శాఖ లక్ష్యమని, అందుకోసం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమ రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ కె. వెంకటేశ్వర్లు, ఎస్ఐ భూమేష్,భీమారం ఎస్ఐ,పోలీసు సిబ్బంది, సీఐఎస్ఎఫ్ జవాన్లు,విద్యార్థులు,స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# బాల్క తీరుపై రఘునాథ్ రెడ్డి ఆగ్రహం



**మందమర్రి, జూన్ 26 (ప్రజాజ్యోతి):** మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పి. రఘునాథ్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామిపై అర్థరహిత విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థ నిర్వీర్యమైందని, అధికారం కోల్పోయిన బాధతో కొందరు నాయకులు కార్మికులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి నిధులు ఇతర ప్రాంతాలకు తరలిపోయినప్పుడు బాల్క సుమన్ ఏం చేశారని ప్రశ్నించారు.మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మందమర్రి పట్టణ అధ్యక్షుడు మంద తిరుమలరెడ్డి, వేణుగోపాల్, పాషా, సంఘీ సంతోష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమం



**ఆసిఫాబాద్, జూన్ 26 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ పట్టణంలోని జానకాపూర్ 1వ వార్డులో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ ఎం. డేవిడ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ఎం. డేవిడ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ ఎం. ఆకాష్ వార్డు కౌన్సిలర్ జాడి వినోద్,ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన ప్రక్రియను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, అవసరమైతే నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు అధికారి రామయ్య, బీఎల్ఓ విజయలక్ష్మి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరారు.

## ఓటరు జాబితాలో పేరు తప్పనిసరిగా పరిశీలించుకోండి:

**గుర్నూలలే నారాయణ**



**ఆసిఫాబాద్ జూన్ 26** ప్రజా జ్యోతి ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు కావడంతో ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నూలలే నారాయణ అన్నారు. వాంకిడి మండలం ఖమన గ్రామంలో శుక్రవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే సరిచేసుకోవాలని తెలిపారు. గ్రామ ప్రజలు ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించి, తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ పొచ్చుబాయి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుర్నూలే మెంగాజీ, బంబర సర్పంచ్ కృష్ణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ, బీఎల్ఏ రత్నం రామారావు, వార్డు సభ్యురాలు సంగీత, గ్రామస్తులు జాడి మారుతి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి, సత్యానికి ప్రతీక మొహర్రం ఎండి అహ్మద్



**ఆసిఫాబాద్, జూన్ 26 ప్రజా జ్యోతి** మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జామియా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్ మైనార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండి అహ్మద్ మాట్లాడుతూ.. మొహర్రం కేవలం పండుగ మాత్రమే కాదని, త్యాగానికి, సత్యానికి, ధర్మానికి ప్రతీక అని అన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పేందుకు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన మహోన్నత త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. కులమతాలకు అతీతంగా సోదరభావంతో కలిసిమెలిసి జీవించడమే మొహర్రం పండుగ ఇచ్చే సందేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు షబ్బీర్, మైనార్టీ నాయకులు షేక్ షాకీర్, సాలం, నజీర్, అఖిల్, సర్దార్, సాజిద్, స్థానిక ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఆడే ప్రేమ్ సింగ్ రాథోడ్‌కు శుభాకాంక్షలు




**మంచిర్యాల,26, జూన్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఆడే ప్రేమ్ సింగ్ రాథోడ్‌కు భారతీయ జనతా పార్టీ నస్పూర్ జోన్ ప్రధాన కార్యదర్శి బూర్ల చిరంజీవి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రేమ్ సింగ్ రాథోడ్ నాయకత్వంలో ఎస్టీ మోర్చా మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. సేవే లక్ష్యంగా, సమాజ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు బూర్ల చిరంజీవి తెలిపారు.

## తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్య క్షుడు కుంరశ్యామ్ రావు మృతి



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26, (ప్రజా జ్యోతి)** ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర ఉపాధ్యక్షులు, చింతఘాట్ మాజీ సర్పంచ్ కుంర శ్యామ్ రావు శుక్రవారం ఉదయం క న్నుమూశారు. ఈ వార్త తెలిసిన తుడుందెబ్బ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. కుంర శ్యాం రావు మృతి తమ గుండె కోతకు గురి చేసిందని, శ్యామ్ రావు శారీరకంగా తమమధ్య లేక పోయినా, సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయం అని రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. తుడుందెబ్బ సంఘంలో ఒక సామాన్య కార్యకర్తగా, మండల స్థాయి నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి, నేడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎదిగారని, ఆదివాసీల హక్కులు, వారి సంస్కృతి, సాంప్రదాయాల రక్షణ కొరకు ఆయన నిరంతరం పోరాడారని, ఆయన మరణం ఆదివాసీ సమాజా నికి, హక్కుల పోరాటానికి తీరని లోటు అని ఆయన పేర్కొన్నారు. శ్యాం రావుఅంత్య క్రియలు సాయంత్రం 3 :00 గంటలకు ఆయన స్వ గ్రామ మైన చింఘాట్‌లో నిర్వ హించారు.

**శ్రద్ధాంజలి**

ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆదిలాబాద్ జిల్లా కమిటీ తరపున ఆయనకు కన్నీటి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు త మ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## పేదల సొంతింటి కలకు నాంది.. ఖమనలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభం



**ఆసిఫాబాద్, జూన్ 26 ప్రజా జ్యోతి**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఖమన గ్రామపంచాయతీలో మోతె రజిత--శేఖర్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ వాంకిడి మండల అధ్యక్షుడు నారాయణ, ఖమన గ్రామ సర్పంచ్ సునీత ముఖ్య అతిథులుగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహాల పథకం ఎంతో ఉపయోగకరమని అన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడటంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంగీత, బ్రహ్మయ్య, కాంగ్రెస్ యువజన ఇన్‌చార్జి అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ, బంబర గ్రామ సర్పంచ్ కృష్ణ, వెలిగి గ్రామ సర్పంచ్ భీంరావు, సీనియర్ నాయకులు గుర్నూలే మెంగాజీ, గుండయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్ సమగ్ర సర్వే పై అప్రమత్తంగా ఉండాలి



**జైపూర్, జూన్ 26 (ప్రజా జ్యోతి)**జైపూర్ మండలంలోని కాన్పూర్, మిట్టపల్లి, నర్వా, దుబ్బపల్లి, వెంకటరావుపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఓటర్ సమగ్ర సర్వే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్ల విశ్వంబర్ రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు మంతెన లక్ష్మణ్, వేముల రవీందర్ గౌడ్, సర్పంచ్ కామెర మనోహర్, కాంగ్రెస్ నాయకుడు పందిరి అశోక్, బీఎల్ఏలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్ల విశ్వంబర్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ సమగ్ర సర్వే విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఇంటిని పరిశీలిస్తూ ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఓటర్ల తొలగింపునకు కుట్ర చేస్తోందని కాంగ్రెస్ పార్టీ భావిస్తోందని ఆయన ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

# 140 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణిలో ఎన్నడూ లేని పరిస్థితి ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాల్లో తాజగా “సింగరేణి

**అధికారులు చేపట్టి కొనసాగిస్తున్న పోరు బాట “ పై ప్రత్యేక కథనం ....అధికారుల డిమాండ్లకు కార్మిక సంఘాల మద్దతు**

**సింగరేణి చరిత్రలో కొత్త అధ్యాయం... స్పందించని యాజమాన్యం.. పోరుబాటలో అధికారులు..!**

**పీఆర్పీ బకాయిలే ప్రధాన డిమాండ్ -- శాంతియుత ఉద్యమంతో అధికారుల ఆవేదన**

**నల్ల బ్యాడ్జీల నుంచి రిలే నిరాహార దీక్షల దాకా ఆందోళనల ఉధృతి**

**మంచిర్యాల, జూన్ 26 (ప్రజా జ్యోతి):** 140 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణిలో ఎన్నడూ లేని పరిస్థితి ప్రస్తుతం కనిపిస్తోంది. ఒకవైపు సింగరేణి కార్మికుల సంస్యలపై పోరు బాటకు కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి . మరో వైపు సంస్థ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సింగరేణి అధికారులు కూడా తొలిసారిగా పెద్దఎత్తున శాంతియుత పోరుబాట పట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమకు రావాల్సిన పీఆర్పీ బకాయిల చెల్లింపు, పే అప్‌గ్రేడేషన్, పదోన్నతుల పాలసీ, పోస్టింగ్‌లలో పారదర్శకత వంటి పలు డిమాండ్ల పరిష్కారం కోసం అధికారులు ఉద్యమానికి దిగారు. అయితే ఇప్పటివరకు యాజమాన్యం స్పందించకపోవడం అధికారుల్లో మరింత అసంతృప్తిని పెంచుతోంది. సంస్థ వ్యాప్తంగా సుమారు 2,200 మంది అధికారులు పనిచేస్తున్నారు. వీరికి 2022-23, 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పీఆర్పీ బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. వీటిలో రెండు సంవత్సరాల బకాయిలే సుమారు రూ.277 కోట్ల వరకు ఉంటాయని అంచనా వేస్తున్నారు. సంస్థకు లిక్విడిటీ సమస్యలు లేవని, అయినప్పటికీ తమ సమస్యలను యాజమాన్యం పట్టించుకోవడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే అధికారుల సంఘం నాయకులు పలుమార్లు ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించారు. ప్రత్యక్షంగా కలిసి విన్నవించినా ఎటువంటి స్పందన లేకపోవడంతో ఇప్పుడు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. తొలిదశలో కార్మికశాఖ కార్యాలయాల నుంచి జీఎం కార్యాలయాల వరకు ర్యాలీలు నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. రెండో దశలో విధుల్లో కొనసాగుతూనే నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపట్టారు. ప్రస్తుతం మూడో దశలో భాగంగా సోమవారం నుంచి జీఎం కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని అధికారుల సంఘం నిర్ణయించింది. ఇప్పటికే సింగరేణిలోని ప్రధాన ఏరియాలైన శ్రీరాంపూర్, గోదావరిఖని, కార్పొరేట్ కార్యాలయాలు, జైపూర్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ)తో పాటు వివిధ ఏరియాల్లో అధికారులు నిరసనలు కొనసాగిస్తున్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొంటూనే బహిరంగ ర్యాలీలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నిరసనల్లో పెద్ద సంఖ్యలో అధికారులు, మహిళా అధికారులతో సహా పాల్గొనడం సంస్థలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. రిలే నిరాహార దీక్షలకు కూడా స్పందన లేకపోతే తదుపరి దశలో ఫీల్డ్ విధులను బహిష్కరించడం, అనంతరం “వర్క్ టూ రూల్” అమలు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇది అమల్లోకి వస్తే సంస్థ కార్యకలాపాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

**అధికారుల ముఖ్య డిమాండ్లు ఇవే...................**

మూడేళ్ల పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించాలి

కోల్ ఇండియా తరహాలో పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలి

పదోన్నతుల పాలసీ రూపొందించి అమలు చేయాలి

పోస్టింగ్‌లు, బదిలీల్లో పారదర్శకత ఉండాలి

సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నివారించాలి

సంస్థకు రావాల్సిన రూ.50 వేల కోట్ల బకాయిలను వసూలు చేయాలి

అధికారులకు గత ప్రభుత్వం హామీ ఇచ్చిన ఉచిత విద్యుత్ అమలు చేయాలి

ఐబీటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలి

సంస్థ భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలి

**పే అప్‌గ్రేడేషన్ తొలి డిమాండ్...**

అధికారుల ప్రధాన డిమాండ్లలో మొదటిది పే అప్‌గ్రేడేషన్ అని తెలుస్తోంది. కోల్ ఇండియా లిమిటెడ్ (సి ఐ ఎల్ )లో 2026 జనవరి నుంచి పే అప్‌గ్రేడేషన్ అమలుకు చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించి సింగరేణిలో కూడా కమిటీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆ కమిటీ ఇప్పటికే తన నివేదికను సమర్పించిందని, దానిని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (బి ఓ డి ) సమావేశంలో ప్రవేశపెట్టి అమలు చేస్తే సరిపోతుందని అధికారులు పేర్కొంటున్నారు.

**పీఆర్పీపై అధికారుల ఆవేదన...............**

పీఆర్పీ అనేది జీతంలో భాగమని 2007లోనే ఒప్పందం జరిగిందని అధికారులు గుర్తు చేస్తున్నారు. అయితే 2007 నుంచి 2014 వరకు అప్పటి ప్రభుత్వం దీనిని అమలు చేయలేదని, కోర్టు ద్వారా సాధించుకోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. అనంతరం




2013-14 నుంచి 2021-22 వరకు పీఆర్పీ చెల్లింపులు జరిగాయని పేర్కొంటున్నారు. కానీ ప్రస్తుతం 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాలకు సంబంధించిన పీఆర్పీ బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని అధికారులు వాపోతున్నారు. మరోవైపు కోల్ ఇండియా సంస్థలో 2022-23, 2023-24 సంవత్సరాల బకాయిలు ఇప్పటికే చెల్లించగా, 2024-25 బకాయిల చెల్లింపులకు కూడా చర్యలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అయితే సింగరేణిలో మాత్రం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం లేకపోవడం అధికారుల్లో అసంతృప్తి పెంచుతోందని తెలుస్తోంది. ఈ ఉద్యమానికి సింగరేణిలోని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో పాటు ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్ తదితర కార్మిక సంఘాలు కూడా మద్దతు తెలుపుతున్నాయి. సింగరేణి ఉత్పత్తికి అధికారుల పాత్ర కీలకమని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇక సింగరేణిలో అధికారులు అంటే యాజమాన్యంలో కీలక భాగంగా భావిస్తారు. అలాంటి అధికారులే రోడ్లపైకి వచ్చి ర్యాలీలు, నిరసనలు చేపట్టడం సింగరేణి చరిత్రలో అరుదైన పరిణామంగా పలువురు పేర్కొంటున్నారు. సంస్థకు వెన్నెముకగా భావించే అధికారులు అసంతృప్తి వ్యక్తం చేయడం సాధారణ విషయం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. “సింగరేణి కోసం అహర్నిశలు పనిచేస్తున్నాం. అనేకసార్లు సమస్యలు పరిష్కరించాలని కోరాం. అయినా స్పందన లేకపోవడం బాధాకరం. అధికారులకు రావాల్సిన పీఆర్పీ బకాయిలతో పాటు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలి” అని సీఎంఓఏఐ నాయకులు తెలిపారు. ప్రస్తుతం సింగరేణిలో నెలకొన్న పరిస్థితి “అసలు సింగరేణిలో ఏమి జరుగుతోంది?” అనే ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఇప్పటికైనా అధికారులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తే సంస్థ ప్రతిష్ఠకు ఏర్పడుతున్న మచ్చ తొలగిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. లేదంటే భవిష్యత్తులో ఈ ఆందోళనలు మరింత తీవ్రమై సంస్థ కార్యకలాపాలపై ప్రభావం చూపే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం అధికారుల ఉద్యమం సంస్థలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## పారిశుద్ధ్య నిర్వహణపై ఉప సర్పంచ్ దీపక్ ప్రత్యేక దృష్టి

**ఆసిఫాబాద్ జూన్ 26 ప్రజా జ్యోతి** వాంకిడి మేజర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణపై ఉప సర్పంచ్ ముండే దీపక్ ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామంలోని ప్రధాన డ్రైనేజీలను శుభ్రం చేసి, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి పారుదల సక్రమంగా జరిగేలా డ్రైనేజీల్లోని మురుగును తొలగించి, ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దీపక్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి వార్డులో శుభ్రత కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్ణీత ప్రదేశాల్లో వేయాలని సూచించారు. గ్రామ పరిశుభ్రతకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరూ భాగస్వాములైతేనే ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన గ్రామాన్ని నిర్మించగలమని ఆయన పేర్కొన్నారు.



# రాజకీయాల జోలికి మేము వెళ్లలేదు స్థానిక హక్కుల కోసమే పోరాటం

## మంత్రి పేరును వివాదంలోకి లాగింది శ్రీరాంపూర్ అసోసియేషన్‌నే: ఫయాజ్

### 30 శాతం ఒప్పందం ప్రకారం కర్ర లోడింగ్ మాకే కేటాయించాలని విజ్ఞప్తి



**జైపూర్, జూన్ 26 (ప్రజా జ్యోతి)** జైపూర్ మండల లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులపై గురువారం జరిగిన దాడి ఘటన అనంతరం వివాదం మరింత ముదురుతోంది. ఈ నేపథ్యంలో శ్రీరాంపూర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు ఉమ్మడి జైపూర్ మండల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఘాటుగా స్పందించింది. స్థానిక లోడింగ్ హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్ని రాజకీయ రంగు పులమడం సరికాదని అసోసియేషన్ ఫౌండర్, చైర్మన్ మహ్మద్ ఫయాజ్ అన్నారు.శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫయాజ్ మాట్లాడుతూ లారీ అసోసియేషన్ నాయకుడిగా కాకముందే ప్రజల కోసం పోరాడాను.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జైపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా స్థానిక లారీ యజమానులకు లోడింగ్ అవకాశాలు కల్పించాలని ఉద్యమించాను. ఇప్పుడు కూడా అదే లక్ష్యంతో స్థానిక అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్నాం అని తెలిపారు. శ్రీరాంపూర్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పేరును ప్రస్తావిస్తూ తప్పుడు ప్రచారం చేయడం విచారకరమని ఆయన అన్నారు.తాను మంత్రి పేరును ఉపయోగించలేదనీ ఆయన పేరును వివాదంలోకి తీసుకొచ్చింది శ్రీరాంపూర్ అసోసియేషన్ వారే అని పేర్కొన్నారు.అదే విధంగా ప్రేమ్‌సాగర్‌రావు పేరును కూడా ప్రస్తావిస్తూ తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ఆ విషయం ఆయనకు తెలుసో లేదో కూడా తెలియదు. రాజకీయ నాయకులను ఈ వివాదంలోకి లాగడం సరికాదని అన్నారు.తమ అసోసియేషన్ కేవలం కుటుంబ సభ్యులతోనే నడుస్తోందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఫయాజ్ స్పష్టం చేశారు. భీమారం, టేకుమట్ల, దుబ్బపల్లి, నర్సింగాపూర్, ఇందారం తదితర గ్రామాలకు చెందిన లారీ యజమానులు తమ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్నారని తెలిపారు.ఇకపై ఇలాంటి ఘర్షణలు పునరావృతం కాకుండా, గతంలో కుదిరిన 30 శాతం ఒప్పందం ప్రకారం కర్ర లోడింగ్‌ను ఉమ్మడి జైపూర్ మండల లారీ ఓనర్స్ అసోసియేషన్‌కే కేటాయించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోలసాని భాస్కర్ రెడ్డి, కార్యదర్శి ఎం.డి. షర్ఫుద్దీన్, ఉపాధ్యక్షుడు ఎం.డి. యాకూబ్‌తో పాటు లారీ యజమానులు తిరుపతి, నరేష్, సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సోనాల మండలంలో ప్రారంభమైన సమగ్ర సర్వే

**సోనాల, జూన్ 26 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రం లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ను బీఎల్ ఓ అశోక్ తో కలిసి బోథ్ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గుడాల అనీష్ కుమార్ ప్రారంభించారు.ప్రతి ఓటరు తన ఓటు ప్రాధాన్యతను తెలుసుకోవాలని తమ ఓటును కోల్పోతే రేషన్ కార్డ్,ఫెన్షన్ మరియు ఇతర సంక్షేమ పథకాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుందని ప్రతి ఓటరును చైతన్య పరిచారు.ప్రతి బీఎల్ ఓ ప్రతి ఇంటికి 3 సార్లు వస్తారు కావున ప్రతి ఓటరు కచ్చితమైన వివరాలు బీఎల్ ఓ కి ఇస్తూ వారికి సహకరించాలని సూచించారు.



# చేతి బోరు మరమ్మతులు ఎప్పుడంటున్న గ్రామస్థులు

**ఆసిఫాబాద్ జూన్ 26**ప్రజా జ్యోతి ఆసిఫాబాద్ జిల్లా గుండి గ్రామపంచాయతీ పరిధిలోని 2వ వార్డు ప్రభుత్వ పాఠశాల ఎదుట ఉన్న చేతి బోరు గత 15 రోజులుగా చెడిపోయి మరమ్మతులకు నోచుకోకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులతో పాటు స్థానికులు కూడా ఈ బోరుపైనే తాగునీటి కోసం ఆధారపడుతుండగా, బోరు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలోనూ తాగునీటి సమస్య కొనసాగుతుండటంతో సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.చేతి బోరును వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగించాలని వారు విజ్ఞప్తి చేశారు. సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## గ్రామాల్లో కొనసాగుతున్న ఓటర్ జాబితా సవరణ



**నేరడిగొండ జూన్ 26 (ప్రజాజ్యోతి):**గ్రామంలో ఈరోజు ఎస్.ఐ.ఆర్ ఫారాల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామ ప్రజలకు ఈ ఫారాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్ సబ్లె. మెహర్బన్, వార్డు మెంబర్ సిడం. సంతోష్, ప్రముఖులు పెందూర్. జగదీష్, పెందూరు. లక్ష్మణ్ లతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఫారాల పంపిణీ సజావుగా సాగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## రెక్కులకు మళ్లీ రెక్కలు

### మండల రాజకీయాల్లో నూతన జోష్



**జైపూర్ జూన్ 26** ప్రజా జ్యోతి జైపూర్ మండలంలో రెక్కులకు మళ్లీ రెక్కలతో జోష్ పెరగనుంది,సరైన సమయం వచ్చినప్పుడు పాత గాయాలు మానిపోతాయి కోల్పోయిన శక్తి తిరిగి చేరుతుంది అన్నట్టుగా స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది.రెక్కులకు మళ్లీ రెక్కలు వస్తున్నాయి అనే నినాదం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.ఇటీవల జరిగిన ఒక ముఖ్య కార్యక్రమంలో కొంతకాలంగా నిశ్శబ్దంగా ఉన్న ఓ కీలక నాయకుడిని పెద్దాయన స్వయంగా వేదికపైకి పిలవడం అందరినీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.ఈ ఘటనతో అక్కడున్న రాజకీయ వర్గాల్లో కొత్త సమీకరణాలు మొదలయ్యాయని చర్చ సాగుతోంది.గతంలో ఆయనకు దూరంగా ఉన్నారని భావించిన కొందరు ఇప్పుడు మళ్లీ ఆయన వైపు తిరిగే అవకాశం ఉందని ఆరోపణలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.తనకు చెప్పుడు మాటలు ఆయన వినడంతో తన శక్తిని పూర్తిగా కోల్పోయాడని రాజకీయ వర్గాల్లో కూడ వినిపిస్తున్నాయి.ఇక మరోవైపు ఆయన ప్రస్తుతం తన రాజకీయ గేర్ మార్చినట్టు స్పష్టంగా కనిపిస్తున్నదని అనుచరులు చెబుతు న్నారు.అందరూ నా వాళ్లే అనే నినాదంతో శాంతియుతంగా ముందుకు సాగుతున్నారని సమాచారం. ఇంతేకాకుండా తన దగ్గర నుంచి దూరమైన కొందరు నాయకులు కూడా ఫోన్ చేస్తే చాలు వెళ్తాం అన్న స్థాయిలో ఉన్నారని లోపలి వర్గాల మాట.వాళ్లే నా బలం అన్న భావనతో కొందరు నాయకులతో చర్చించినట్టు సమాచారం.ఈ పరిణామాలతో స్థానిక రాజకీయాల్లో మళ్లీ కొత్త ఉత్సాహం కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి: కాంగ్రెస్ నాయకులు




**ఆసిఫాబాద్ జూన్ 26 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి బాధ్యతతో పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు గణేష్, కిషన్ సూచించారు. వాంకిడి మండల కేంద్రంలోని రాంనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగిపోకుండా పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోరని పేర్కొన్నారు. గ్రామ, మండల స్థాయిలో పార్టీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి ఓటరు నమోదు, పేర్ల మార్పులు, చేర్పులు, సవరణలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చే బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందని వారు అన్నారు.

## ప్రభుత్వ ధరలకే ఎరువుల విక్రయం చేయాలి

**అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు: డీఏఓ**



**ఆసిఫాబాద్ జూన్ 26 ప్రజా జ్యోతి** రైతులకు ఎరువులను ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వెంకటి ఎరువుల డీలర్లకు సూచించారు. రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల విక్రయాలు చేపట్టడం సహించబోమని హెచ్చరించారు. వాంకిడి మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, యూరియా సహా అన్ని రకాల ఎరువుల నిల్వలు, విక్రయ రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినా, నిల్వలు దాచిపెట్టినా, అక్రమాలకు పాల్పడినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఏఓ వెంకటి హెచ్చరించారు. రైతులు కూడా ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు.

# బహుజనుల రాజ్యాధికార సాధనే లక్ష్యం

**జూలై 5న భువనగిరిలో 'రాజ్యాధికార సమరభేరి' బహిరంగ సభ**

**గోడ పత్రికలను ఆవిష్కరించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్**

**ప్రతి ఇంటి నుండి ఒకరు కదిలి రావాలని పిలుపు 90 శాతం ఉన్న బీసీలు చైతన్యం కావాలి**

**తాళ్ల రవీందర్ జిల్లా అధ్య క్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముఖ్య నాయకులు**

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26, (ప్రజా జ్యోతి)**తెలంగాణ రాష్ట్రంలో బహు జనుల రాజకీయ చైతన్యాని కి, హక్కుల సాధనకు వేదికగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో వచ్చే జూలై 5వ తేదీన భువనగిరి జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించ తలపెట్టారు. ఈ ప్ర తిష్టాత్మక రాజ్యాధికార సమర భేరి సభకు సంబంధించిన గోడ పత్రికలను (పోస్టర్లను) శుక్రవారం ఆదిలా బాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణ లో ఘనంగా ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి, ఆదిలా బాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ కొమ్ముల ప్రవీణ్ రాజ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, పా ర్టీ ముఖ్య నాయకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన అక్కడి మీడియా ప్రతినిధులతో సభ ప్రాముఖ్యతను వివరిస్తూ మా ట్లాడారు.

**హక్కుల సాధనకు బహుజ నులు ఐక్యం కావాలి**

**కొమ్ముల ప్రవీణ్ రాజ్**

ఈ సందర్భంగా కొమ్ముల ప్రవీ ణ్ రాజ్ మాట్లాడుతూ సమా జంలో మెజారిటీ సంఖ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా తగిన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజనుల రాజ్యాధికార సాధనే ధ్యేయం గా, వారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేందుకే భువనగిరిలోఈ రాజ్యాధి కార సమరభేరి" సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుండి ప్రజలు, మేధావులు, యువకులు ఈ సభకు భారీగా తరలిరావాల ని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఒక తాటిపైకి వచ్చి, తమ హక్కుల కోసం




పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మన ఓటుతో పాలకులుగా మారుతున్న వారు మన ల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, అం దుకే ఇప్పుడు మనమే పాల కులం కావాలని, ఈ చైతన్యా న్ని రగిలించేందుకే ఈ సభ ని ర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతి గ్రామం నుండి, ప్రతి ఇంటి నుండి కనీసం ఒక్కరైనా బాధ్యతగా ఈ సమరభేరి సభకు తరలివచ్చి విజయవంతం చేయాలి" అని ఆయన గట్టిగా కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు ఈ గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు తాళ్ల రవీందర్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, జూల సంతోష్ ఉపాధ్యక్షులు,జనరల్ సెక్రెటరీ సాయి ప్రసాద్, ఉపా ధ్యక్షులు విట్టల్, టౌన్ ప్రెసి డెంట్ బాస సంతోష్ పాల్గొని ప్రసంగించారు. వీరితో పాటు పార్టీ ముఖ్య నాయకులు ద త్తాత్రి, అల గంటి శ్రీనివాస్, రాక్రె మహేందర్, బ్రదర్, కేమ నోజ్, ప్రభా కర్, కార్తీక్, ఆకుల రాజు, ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కార్యకర్త లు, అను బంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారి ఉగ్రవాదం కంటే ప్రమాదకరం

**డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్**

**ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా 'యాంటీ డ్రగ్స్ డే 5కె రన్'**

**జిల్లా ఎస్పీ, అధికారులతో కలిసి పరుగెత్తిన డాక్టర్ నరేష్ జాదవ్**

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26, (ప్రజా జ్యోతి)**యువత శారీరక వ్యాయా మం, క్రమశిక్షణను అలవర్చు కోవాలని పిలుపుయువతను పక్కదారి పట్టిస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలు ఉగ్ర వాదం (టెర్రరిజం) కంటే అత్యంత ప్రమాదకరమైనవని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ క మిటీ (డిసిసి) అధ్యక్షులు డా క్టర్ నరేష్ జాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సం దర్భంగా శుక్రవారం ఆదిలాబా ద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ '5కె రన్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ నరేష్ జాదవ్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర పోలీస్ అధికారులతో కలిసి రన్ లో పాల్గొన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి ప్రారంభమైన ఈ 5 కె రన్ అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి స్టేడియం వరకు కొన సాగింది. వందలాది మంది వి ద్యార్థులు, యువకులతో కలి సి నరేష్ జాదవ్ ఉత్సాహంగా పరుగెత్తుతూ వారిని ఉత్తేజ పరిచారు.అనంతరం స్టేడి యంలో ఏర్పాటు చేసిన ముగింపు, బహుమతుల ప్రధానో త్సవ సభలో డాక్టర్ నరేష్ జా దవ్ మాట్లాడుతూ దేశ భవి ష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, అయితే చెడు అల వాట్లు యువ శక్తిని నాశనం చేస్తున్నాయని అన్నారు. ఒక్క సారి డ్రగ్స్ మహమ్మారి బారిన పడితే జీవితాలు అంధకార మవుతాయని, అందుకే తల్లి దండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థులు



క్రమశిక్షణతో చ దువుకుంటూ, ప్రతిరోజూ శారీ రక వ్యాయామాలు చేయాలని, తద్వారా మానసిక ఉల్లాసం, దృఢత్వం సిద్ధిస్తుందని సూచించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడానికి పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆది లాబాద్ మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్, మా ర్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీ అ ధ్యక్షులు సాజిద్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్య క్షులు పరమేశ్వర్, మాజీ డీటీ డీ బోర్డు మెంబర్ బెజ్జంకి అని ల్, జిల్లా జనరల్ సెక్రెటరీ గౌలి సంజీవ్, గుడిహత్నూర్ మండ ల కాంగ్రెస్ అధ్యక్షులు దౌలత్ రావు, పలువురు జిల్లా పోలీ స్ అధికారులు, ఉపాధ్యాయు లు, విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

## నేడు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల స మావేశం

డిసిసి అధ్యక్షుడు నరేష్ జాద వ్




ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26,(ప్రజా జ్యోతి) జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నేడు(27) ఉదయం 10:00 గంటలకుత ఆదిలా బాద్ జిల్లా కేంద్రంలోనీ తనీషా గార్డెన్లో నిర్వహి స్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ఇన్ చార్జీలు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ ప్రతిని ధులు, యువజన కాంగ్రెస్, ఎ న్ ఎస్ యు ఐ నాయకులు, బి ఎల్ ఎలు అందరు హాజరు కావాలని కోరారు. 27 (శనివారం ) ఉదయం 10:00 గం టలకు తనీషా గార్డెన్లో నిర్వ హించబడే ఈ ముఖ్య సమా వేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంబం ధిత నాయకులు, ప్రజా ప్రతిని ధులు, కార్యకర్తలు తప్పనిసరిగా సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సిరికొండ గ్రామపంచాయతీలో ఎస్ ఐ ఆర్ ఎమ్యునరేషన్ ప్ర క్రియను పరిశీలించిన సర్పంచ్



సిరికొండ, జూన్ 26, (ప్రజా జ్యోతి) ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిం చడం ఎంతో ముఖ్యం అని సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి అన్నారు. శుక్రవారం సిరికొండ గ్రామంలో స్థానిక సర్పంచ్ బొ డ్డు దత్తాత్రి సిరికొండ 158 వ బూత్ బి ఎల్ ఓ మౌనజ ఆర్ ఐ రాజేశ్వర్ తో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎమ్యునరేషన్ ప్రక్రి యను ఇంటింటి కి వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహిం చడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబి తాలో నమోదు కావడం తో పాటు, ఎలాంటి అర్హత లేని పేర్లు లేకుండా అధికారులు, సిబ్బంది, బిఎల్ ఓలు బాధ్య తాయు తంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవె న్యూ సిబ్బంది, స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా 'పీర్ల పండుగ'గా

ఘనంగా మొహరం పండుగ... యువకుల ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ...



తాండూర్ జూన్ 26 ప్రజాజ్యోతితాండూర్ గ్రామంలో ఘనంగా మొహరం పండుగ నిర్వహించారు ఈ సందర్భంగా యువకుల ఆధ్వర్యంలో జాతర వద్ద షర్బత్ పంపిణీ చేశారు ప్రతి ఏటా మొహరం పీరీల పండుగ ఘనంగా జరుపుకుంటారు యువకులు షర్బత్ పంపిణీ చేస్తారు పీర్ల పండుగ తెలంగాణ, ముస్లింలతో పాటు హిందువులు కూడా దీనిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపు కుంటారు. ఈ కార్యక్రమంలో హాస్యం బాబా, ఎండి సమీ ,హబీ బ్ అజార్ ,ముష్రఫ్ అలీ ఎండి సాదిన్, తదితరులు పాల్గొన్నారు

## పోలీసు పిఆర్ఓ కు ప్రశంసా పత్రం




ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26,( ప్రజా జ్యోతి)పౌర సంబంధాల అధికారి (ప బ్లిక్ రిలేషన్ ఆఫీసర్)గా ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీస్ పి ఆర్ ఓ హేమంత్ కు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రశం సాపత్రం అందజేసి అభినం దించారు.ఆదిల ాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూ లన కార్యక్రమం" లో భాగంగా 5 కె రన్ లో తన వృత్తిలో భాగంగా ఫోటోగ్రఫీ తో పాటు పత్రి కా మిత్రులకు, పోలీస్ సి బ్బందికి అందరికీ ప్రోత్సాహకంగా నిలుస్తున్నందుకు అభి నందనలు తెలుపుతూ ప్రశంసా పత్రాన్ని అందించారు.

## మత సామరస్యానికి ప్రతికగ నిలుస్తున్న మొహరం పండుగ



సోనాల, జూన్ 26 ( ప్రజాజ్యోతి ): సోనాల మండల కేంద్రంలో శుక్రవారం రోజు మొహరం ముగింపు సందర్భంగా గ్రామంలో పీర్ల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు తమ మొక్కలను పెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద వసంత్ రావు సూర్య మాట్లాడుతూ, మా ఊళ్లో తరతరాలుగా పీర్ల పండగ జరుపుకుంటామని, ఇది మతసామరస్యానికి ప్రతికగా నిలిచే పండగ అని పేర్కొన్నారు.

## ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నేడు, రేపు మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొ ననున్న మంత్రి

ఓటర్ల జాబితా ప్రత్యేక సవర ణ విస్తృత అవగాహన కార్య క్రమంలో పాల్గొననున్న మంత్రి

ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26, (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, మ ద్యనిషేధ ఆ ఎక్సైజ్ శాఖ, ఉ మ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇం చార్జి మంత్రి జూపల్లి కృష్ణారా వు శనివారం, ఆదివారం (జూ న్ 27, 28) ఆదిలాబాద్, నిర్మ ల్ జిల్లాల్లో విస్తృతంగా పర్య టించనున్నారు. ఈ సందర్భం గా పలు అభివృద్ధి కార్యక్ర మాలను ప్రారంభించడంతో పాటు శంకుస్థా పనలు చేయనున్నారు. విద్య, గృహ నిర్మాణం, రహదారులు, నీటి వనరుల అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో మంత్రి జూపల్లి పాల్గొంటారు.

**జూన్ 27 (శనివారం) కార్యక్రమాలు**

ఉదయం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తానీషా ఫంక్షన్ హాల్ లో నిర్వహించే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వి స్తృత అవగాహన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారు. అనంతరం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పం పిణీ చేస్తారు.ఆ తర్వాత ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, మైనారిటీ బాలికలు, బాలుర రెసిడెన్ని యల్ పాఠశాలల ప్రారంభో త్సవం చేస్తారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సం బంధించిన తెలంగాణ గిడ్డం గుల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూ సీ) గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. విద్యా ర్థులు, తల్లిదండ్రులతో ము ఖాముఖి నిర్వహించి, విద్యా సంబంధిత కిట్స్ పంపిణీ చే స్తారు. సాయంత్రం ఉట్నూర్ లో విద్యార్థులు, పాఠశాలలకు విద్యా సహాయ కిట్ల పంపిణీ చేసి, కేంద్ర గ్రంథాలయ భవ నానికి శంకుస్థాపన చేస్తారు.అనంతరం రూ .14 కోట్లతో ఖానాపూర్ నియోజకవర్గం లోని నచ్చన్న ఎల్లాపూర్ ర హదారి విస్తరణ, మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేయ డంతో పాటు బొడ్డోనికుంట చె రువు పునరుద్ధరణ పనులకు రూ. 1.21 కోట్లతో శంకుస్థాప న చేస్తారు.

**జూన్ 28 (ఆదివారం) కార్యక్రమాలు:**

ఉదయం బాసర నుంచి భైం సా చేరుకుని భైంసా ము న్సిపాలిటీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తా రు. అలాగే మహదేవ్‌పూర్ చెరువు పునరుద్ధరణ పను లకు రూ. 2.14 కోట్లతో శంకు స్థాపన చేస్తారు.అనంతరం నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో నిర్వహించే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వి స్తృత అవగాహన కార్యక్రమం లో పాల్గొంటారు.

## ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు .. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటే యాజమాన్యాలు ప్రైవేటు కాలేజీలను ఎలా నడుపుతారని నిలదీసింది. అదే సమయంలో రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది.

## అయోధ్య విరాళాల్లో అవినీతి

హైదరాబాద్ : అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల సేకరణలో ఏకంగా రూ. 200 కోట్ల భారీ అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పినప్పటికీ... యూపీ సిట్ పోలీసులు ఆయన సొంత మనుషులనే అరెస్ట్ చేశారని తెలిపారు. కేవలం చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను పదవుల నుంచి తప్పించి బీజేపీ చేతులు దులుపుకుంటే సరిపోదని, ఈ స్కామ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని, దేవుడి కోసం సేకరించిన విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని చామల మండిపడ్డారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి చెందిన 20 మంది ఎంపీలను, మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రేకు చెందిన ఆరుగురు ఎంపీలను ఒక్కొక్కరికీ రూ. 75 కోట్లు ఇచ్చి కొనుగోలు చేయడానికి ఈ రాముడి సొమ్మునే వాడారంటూ తీవ్రస్థాయిలో ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని... ఇప్పుడు చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను కేవలం పదవుల నుంచి తప్పిస్తే సరిపోదని అన్నారు.

## 'గోల్డ్ మ్యాన్' సూర్య భాయ్‌పై చీటింగ్ ఆరోపణలతో కేసులు

హైదరాబాద్ : సోషల్ మీడియాలో ఒంటినిండా బంగారంతో మెరిసిపోతూ 'గోల్డ్ మ్యాన్'గా గుర్తింపు తెచ్చుకున్న పి. సురేశ్ కుమార్ అలియాస్ సూర్య భాయ్‌పై హైదరాబాద్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. తక్కువ ధరకే దిగుమతి చేసుకున్న బంగారం ఇప్పిస్తానని చెప్పి పలువురిని మోసగించినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తనకు అత్యంత సన్నిహితులని నమ్మించి, మార్కెట్ రేటు కంటే తక్కువకే బంగారం ఇస్తానని చెప్పి డబ్బులు వసూలు చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకున్నాక బంగారం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఒక బాధితుడి నుంచి రూ.32 లక్షలు వసూలు చేసిన సూర్య భాయ్, ఆ తర్వాత బంగారం ఇవ్వలేదు. బాధితులు అతని ఇంటికి వెళ్లి నిలదీయగా, వారికి మూడు ఐఫోన్లు ఇచ్చి, రూ.20 లక్షలకు చెక్కు రాసిచ్చాడు. అయితే, ఆ తర్వాత వారిని బెదిరించి ఫోన్లను తిరిగి లాక్కున్నట్లు బాధితులు తమ ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై మొదట అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, కేసును నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.దీంతో పాటు పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేసినందుకు గాను సూర్య భాయ్‌పై మరో కేసు కూడా నమోదైంది. అతను ఇచ్చిన సమాచారం అవాస్తవమని తేలడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ మోసాల వెనుక ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.అత్తాపూర్‌లో నివసించే 34 ఏళ్ల సూర్య భాయ్, ఒంటినిండా బంగారు ఆభరణాలు ధరించి, తెల్లటి దుస్తుల్లో గుర్రాలు పట్టుకుని వీడియోలతో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యాడు. ఈ ఏడాది మార్చిలో ఆదాయపన్ను శాఖ అధికారులు అతనిపై దృష్టి సారించారు. అయితే, వారి తనిఖీల్లో అతను ధరించిన ఆభరణాల్లో చాలా వరకు నిజమైన బంగారం కాదని, చౌకబారు లోహాలతో చేసిన నకిలీవని తేలింది.

## కొనసాగుతున్న బంద్

హైదరాబాద్ : తెలంగాణ ప్రజలకు ముఖ్యమైన గమనిక.. మూడు రోజుల పాటూ రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలగనుంది. ఈ నెల, 27, 28 తేదీల్లో సేవలు నిలిపివేయనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్, అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించి సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో తెలియజేశారు. 28న ఆదివారం కావడంతో ప్రభుత్వ సెలవులు వచ్చాయి. ఈ నెల 27న పనిదినం.. ఆ ఒక్కరోజు రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి యథావిధిగా సేవలు పునఃప్రారంభమవుతాయని గాంధీ తెలిపారు.

# మతసామరస్యానికి ప్రతీక మొహర్రం 'పీర్ల పండుగ'

### డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్

### రుయ్యాడి గ్రామంలోని హస్సేన్ హుసేన్ దేవస్థానాన్ని దర్శించుకున్న నరేష్ జాదవ్

### పంటలు బాగా పండాలని ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26,( ప్రజా జ్యోతి)** మొహర్రం పండుగ కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి జరుపుకునే పండుగ అని, ఇది భారతదేశంలోని మత సామరస్యానికి సజీవ ప్రతీక అని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్య క్షులు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు.ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండ లంరు య్యాడి గ్రామంలోని ప్రసిద్ధ 'హస్సేన్ హుసేన్' దేవస్థానాన్ని ఆయన జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వా గతం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సం దర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ ఈ ఏడాది వానలు బాగా కురిసి పంటలు స మృద్ధిగా పండాలని, జిల్లా ప్ర జలంతా సుఖశాంతులు, ఆ యురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుడిని వేడుకున్న ట్లు తెలిపారు. గ్రామంలో మొ హర్రం వేడుకలను ఎంతో వైభ వంగా, క్రమశిక్షణతో నిర్వహి స్తున్న హస్సేన్ హుస్సేన్ ఆలయ కమిటీ సభ్యులను ఆయ న ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నరేష్ జాదవ్ తో పాటు మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారె డ్డి, ఆదిలాబాద్ మార్కెట్ క మిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి



అనూష సతీష్, తలమడుగు మాజీ జె డ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, స్థాని క గ్రామ సర్పంచ్ ఉడుగు రాకే ష్, తలమడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతాప్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బొల్లారం బాబన్న, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గౌలి సంజయ్ కుమార్, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ బెజ్జంకి అనిల్ కుమార్, గుడి హత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, మాజీ ఎంపీపీ రాజేశ్వర్, తల మడుగు యూత్ కాంగ్రెస్ నాయకులు సాయి కిరణ్, రుయ్యాడి గ్రామకాంగ్రెస్ నాయకులు సాంబశివుడు, ప్రవీణ్ రెడ్డిలతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గంజాయి సేవించే వారిపై జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు


### 40 మందికి గంజాయి టెస్టింగ్ కిట్లతో పరీక్షలు10 మందికి పాజిటివ్

### గంజాయి వ్యసనానికి చికిత్సే మార్గం... డి-అడిక్షన్ సెంటర్లకు తరలింపు

### ఇప్పటివరకు 39 మందినిడి అడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

### గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణానికి పోలీస్ శా ఖ ప్రత్యేక కార్యాచరణ

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26, (ప్రజా జ్యోతి)** గంజాయి రహిత ఆదిలాబా ద్ జిల్లా నిర్మాణమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆధ్వర్యంలో "యాంటీ డ్రగ్ వీక్" సందర్భంగా మాదకద్ర వ్యాల నిర్మూలనకు పలు వినూత్న కార్యక్రమాలు చేప డుతోంది. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలతో పాటు వ్యస నానికి బానిసైన వారిని గుర్తిం చి వారికి చికిత్స అందించి సాధారణ జీవితంలోకి తీసు కురావడంపై ప్రత్యేక దృష్టి సారి స్తోంది.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉ న్న 20 పోలీస్ స్టేషన్ల పరిధి లో, గతంలో గంజాయి కేసు ల్లో పట్టుబడిన వ్యక్తులను గుర్తించి ఆకస్మిక తనిఖీలు నిర్వ హించారు.



దాదాపు 40 మందికి గంజాయి టెస్టింగ్ కిట్లతో పరీక్షలు నిర్వహించగా, అందులో 10 మందికి గంజాయి సేవించినట్లు పాజిటివ్ వచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి సేవించినట్లు గుర్తించిన వారిని తదుపరి వైద్య ప రీక్షల అనంతరం డి-అడిక్షన్ సెంటర్లకు తరలించి, నిపుణు ల పర్యవేక్షణలో కౌన్సెలింగ్, వైద్య చికిత్స అందించనున్న ట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 39 మంది వ్యసనాపరులను డి డిక్షన్ సెంటర్కు తరలించి చికిత్సను అందించడం జరిగిందని తెలి పారు. వ్యసనానికి బానిసైన వ్యక్తులను శిక్షించడం మాత్ర మే కాకుండా, వారికి సరైన చి కిత్స అందించి కుటుంబ స భ్యులతో కలిసి సాధారణ జీ వితం గడిపేలా చేయడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖి ల్ మహాజన్ ఐపీఎస్ మాట్లా డుతూ మాదకద్రవ్యాల నిర్మూ లనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. గంజాయి సేవించే వ్యక్తులు స్వచ్ఛందంగా వ్యసన విముక్తి కేంద్రాలను ఆశ్రయించా లని, కుటుంబ సభ్యులు కూడా అలాంటి వారిని గుర్తించి చికిత్సకు సహకరించా లని సూచించారు. అదేవిధంగా గంజాయి సాగు, అక్రమ రవా ణా, విక్రయాలు లేదా విని యోగానికి సంబంధించిన స మాచారం తెలిసిన వెంటనే స మీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ అధికారులకు అందించాలని కోరారు. సమా చారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం తో పాటు, పండించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. "గంజాయి రహిత ఆది లాబాద్ జిల్లా" లక్ష్య సాధన కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీ లు, అవగాహన కార్యక్రమా లు, కౌన్సెలింగ్, డి-అడిక్షన్ కార్యక్రమాలు జిల్లాలో నిరంత రం కొనసాగుతాయని తెలిపా రు.

# గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాదకద్రవ్యాలకు వ్యతిరేక కంగా యువత, ప్రజలు పోరాడాలి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృత జ్ఞతలు తెలియజేసిన జిల్లా ఎస్పీ

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో "5కె రన్" నిర్వహణ

పాల్గొన్న 2000 మంది యువత ఐదు కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి యువతకు ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎస్పీ

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంన గర్, హైదరాబాద్, నిజామా బాద్, జిల్లాల నుండి వచ్చిన అభ్యర్థులు

పట్టణంలోని పురవీధుల గుండా కొనసాగిన "5కె రన్"గెలిచిన అభ్యర్థులకు సైకిల్స్, పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రం





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 26, (ప్రజా జ్యోతి)** గంజాయి రహిత అదిలాబాద్ జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పిలుపునిచ్చారు.జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పు రస్కరించు కుని ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఘనంగా "5కె రన్" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మె ల్యే పాయల్ శంకర్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరై మాదకద్ర వ్యాల వ్యతిరేక పో స్టర్లను ఆవిష్కరించి, అనంతరం జెండా ఊపి 5కె రన్‌ను ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, హైదరా బాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 20 00 మంది యువత, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సా హంగా పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ సంఘీభావాన్ని చాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లా డుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో జిల్లా పోలీస్ శాఖ చేప డుతు న్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. తల్లిదం డ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనిస్తూ చెడుఅల వాట్లకుదూరంగా ఉంచాల ని, వ్యసనాలకు గురైన వారికి డీ- అడిక్షన్ కేంద్రాల ద్వారా చికి త్స అందుబాటులో ఉందని తెలిపారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ, గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపు నిచ్చారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుం డా, వాటి అక్రమ రవాణా, విక్రయాల పై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని సూచించారు. వ్యసనానికి గురైన వారిని గుర్తించి చికిత్స అందేలా కృషి చేయడం కూడా సామాజిక బాధ్యతేనని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ స్వయంగా 5 కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం పురుషులు, మహిళల విభాగాల్లో విజే తలైన తొలి పదిమందికి సైకిళ్లు, ప్రశం సా పత్రాలను అంద జేశారు. కార్యక్రమంలో పాల్గొ న్న ప్రతి ఒక్కరి కీ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. తదుపరి సంత కాల సేకరణలో భాగంగా "వాల్ ఆఫ్ ప్రామిస్" వద్ద అతిథులు సంతకాలు చేసి డ్రగ్స్‌కు, మాదక ద్రవ్యాలకు వ్యతి రేకంగా పోరా డుతామని తన సందేశాన్ని లిఖించారు. యాంటీ డ్రగ్ సోల్జర్ ఛాయాచిత్రం వద్ద ఫోటోలు తీసుకొని, మాదకద్ర వ్యాలకు వ్యతిరే కంగా పోరాడుతామని ప్రతిజ్ఞ తీసుకున్నారు. ఈ కార్యక్ర మంలో అదనపు ఎస్పీలు పి. మౌనిక, బి. సురేందర్ రావు, ఉట్నూ ర్ ఏ ఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మా ర్కెట్ కమిటీ అధ్యక్షుడు బి. శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ అధ్య క్షుడు నరేష్ జాదవ్, ఎఫ్టిఓ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధి కారులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు రూ 2లక్షల రుణమాఫీ చేయాలి . ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్.

**రుద్రవరం. :** రైతులు కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీ జరిగే మహాధర్నాలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని చలోవిజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం రైతు సంఘం నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే భాస్కర్ రుద్రవరం మండలం కార్యదర్శి బాల నరసింహుడు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మన రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది ఎన్నికల ముందు కూటమినేతలు గుప్పించిన వాగ్దానాలు గాలి మేడలు అయ్యాయి. క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను తీర్చడానికి ఎలాంటి చర్యలు ఈ ప్రభుత్వాలు చేపట్టడం లేదు. మాది రైతు ప్రభుత్వం రైతు సంక్షేమం అందిస్తున్నామంటూ ప్రచార మాధ్యమాల్లో కోట్లాది రూపాయలతో దొంగ ప్రచారాలు చేసుకోవడం తప్ప రైతులను ఆదుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వాలు ఉండడం లేదు. పంటలకు కనీసం మద్దతు ధర దక్కడం లేదు .సిండికేట్ మార్కెట్ మాయాజాలంలో చిక్కుకొని రైతులు చాలా నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు .కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. కాబట్టి రైతు సంఘం గా మేము చేస్తున్న డిమాండ్ ఏమంటే రైతులకు తక్షణమే రూ2లక్షల రుణమాఫీ ప్రకటించాలి పండిన పంటలకు మద్దతు ధరలు కల్పించాలి. సాగు ఖర్చులు తగ్గేందుకు పెట్రోల్ డీజిల్ వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు తగ్గించాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా పంట రుణాలు ఇవ్వాలి .కౌలు రైతులకు ఎలాంటి హామీ లేకుండా ఆర్బీఐ నిబంధన ప్రకారం ర2 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలి . పంటల బీమా ఇన్పుట్ సబ్సిడీ ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలి. మొక్కజొన్న రైతులకు రైతుల దగ్గర పంట ఉన్నప్పుడే సకాలంలో పంట కొనుగోలు ఏర్పాటు చేసి మద్దతు ప్రకారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి .ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు 7 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచాలి .తెలుగు గంగా కెనాల్ కింద పంట కాలువల నిర్మాణం చేపట్టాలి ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధరలు ప్రకారం రైతుల పంటను కొనుగోలు చేయాలి. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలపై సమరభేరి మోగించేందుకు జూన్ 30న విజయవాడ ధర్నా చౌక్ వద్దకు వేలాదిగా రైతులు కౌలు రైతులు తరలివచ్చి జూన్ 30న విజయవాడ ధర్నా చౌక్ లో జరిగే మహా ధర్నాలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్న రైతులు ఇప్పటికైనా మేల్కొని ప్రశ్నించకపోతే రైతు కనీసం ఒక్క ఎకరం పండించడానికి

## తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వరు

**హైదరాబాద్ :** తెలంగాణ రేవంత్‌రెడ్డి మహిళలకు తులం బంగారం కాదు కదా,తులం ఇనుము కూడా ఇవ్వరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శుక్రవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చేయలేదని, ప్రతి పంటకు బోనస్ ఇస్తానని ఇవ్వలేదన్నారు. రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని మోసం చేశారని, విద్య భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు కాదు ముందు లక్షాధికారులను చేయండి చాలు అని ఎద్దేవా చేశారు.

## వోట్ తో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు

సర్ ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్

**హైద్రాబాద్ :** సర్ ప్రాముఖ్యత అందరూతెలుసుకోవాలని,వోట్ తో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు రాజ్యాంగం మనకి కనిపించిందనిటీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్అన్నారు.శు క్రవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ పాస్పోర్ట్ అనేది కూడా సిటిజెన్ షిప్ కాదు అంటున్నారూ బీజేపీ మెంబెర్ షిప్ ఉంటేనే సిటిజెన్ గా కన్సిడర్ చేస్తున్నారు ఇతర రాష్ట్రాల లో సాఫీ పేరుతో బీజేపీ ఎలా అధికారం లోకి వస్తుందో మనం చూసాం ఇప్పటి వరకు 8 సార్లు సాఫీ ప్రక్రియ జరిగింది దేశం లో తెలంగాణ మా టార్గెట్ అని బీజేపీ నేతలుమాట్లాడుతున్నారు బీజేపీ వోట్ చోరీ , ఈవీఎం చోరీ , సీటు చోరీతో పాటు, పార్టీ చోరీ , రాముని గుడి చందా చోరీ కూడా చేస్తుందని విమర్శించారు.వోట్ అప్లై చేసుకోవటం అందరి బాధ్యత, అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జగదీష్ కోరారు

## షేర్‌గూడలో ఉచిత మెడికల్ క్యాంప్ ప్రజలకు వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ

**రంగారెడ్డి :** డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షేర్‌గూడ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఘనంగానిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు.ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ఫార్మసీ విద్యార్థులు మరియు వాలంటీర్లు సేవలందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వివిధ ప్రాంతాల్లో నిరంతరం నిర్వహిస్తోందని సొసైటీ ఎక్స్ గ్యూటీ మెంబర్ జి.మాధవి తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందం, వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రగ్స్ నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత

గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి

**వరంగల్ :** డ్రగ్స్ నియంత్రణ ప్రభుత్వం బాధ్యతే కాదు తల్లితండ్రులు వైద్యులు పోలీసులు మేధావులు స్వచ్ఛంద సంస్థలు సినీ ప్రముఖులుఉపాధ్యాయులు అందరి బాధ్యత అని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అని అన్నారు. శుక్రవారం హంటర్ రోడ్డు లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అరికట్టాలంటే నార్కోటి కంట్రోల్ రూమ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాల కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నార్కటి కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు డ్రగ్స్ ని అమ్మేవారిని పై కఠిన చర్యలు తీసుకుంటూ వారికి కౌన్సిలింగ్ ద్వారా